# శ్రీధర కథలు

పొగమంచు దట్టంగా కమ్ముకుంది.

గర్ల్స్ హాస్టల్లోని అమ్మాయిలంతా ఇంకా ముసుగుల్లో నుంచి బయటపడలేదు. హరిణి మాత్రం చన్నీళ్ల స్నానం కూడా చేసి డ్రెస్ వేసుకుంటోంది.

పక్క గదిలోని రమణి నిద్రమత్తులో కళ్లు మూసుకుని నడుస్తూ వచ్చి హరిణి టూత్ పేస్ట్ కోసం వెతుకుతోంది చేతులు చాచి.

''ఏయ్, ఏంటే, మారూంలో కొచ్చావ్? నీ రూంలో కెళ్లు'' అన్నది హరిణి.

''ఇవాళ నేను నేను కాదే. అందుకే నీ రూంలోకి వచ్చా...'' అన్నది కునికిపాట్లు పడుతూ రమణి.

''వస్తే వచ్చావు గానీ, నా వస్తువు లేవీ నీ సొంతం చేసుకోకు'' అన్నది హరిణి.

# గాళ్ ఫ్రెండ్

''పిచ్చిదానా... బతికినంతకాలం ఇది నాది, ఇది నీది అని ఆరాట పడతాం... పోయేటప్పుడు ఈ టూత్ బ్రష్షూ, పేస్టూ, టంగ్‌క్లీనరూ మన వెంట వస్తాయటే...'' అని రమణి అనగానే.

ముసుగులో నుంచే చెయ్యి చాచి, షేక్‌హాండ్ ఇచ్చింది పల్లవి ''ఏం చెప్పావే? నగ్నసత్యం చెప్పావు తెల్లారకుండానే...'' అనీ అన్నది.

''ఎనిమిది అవుతోంది... నీకు తెల్లారకపోతే ఎవరికీ తెల్లారదని అనుకోకు...'' అన్నది హరిణి పుస్తకాలు సర్దుకుంటూ.

''తల్లీ... భీతహరిణేక్షిణీ... నీ ఉరుకులు పరుగులన్నీ ఎందుకో ఎవరికి తెలియదులే... హాస్టల్ గేటు ముందర దేవదాసు నీ కోసం పడిగాపులు పడుతుంటాడు.... వాడికోసమే ఈ తొందరంతా...'' అన్నది పల్లవి ముసుగులో నుంచి.

''పోవే... పిచ్చివెధవ... వాడెక్కడ, నేనెక్కడ?'' అన్నది హరిణి.

''నువ్విక్కడ వాడక్కడ... వాడు వచ్చేశాడే అప్పుడే'' అన్నది రమణి కిటికీలో నుంచి బయటకు చూస్తూ.

''వస్తేరానీవే... వాడెవడో మెంటల్ కేసు... రోడ్డు మీద మనుషులతో పాటు కుక్కలూ తిరుగుతుంటాయి. నేనేం చేస్తాను దానికి...'' అన్నది హరిణి పుస్తకాలు తీసుకుని బయటకు వెళ్తూ.

''ఈ నాటి ఈ బంధమేనాటిదో...'' అని రమణి వెనక నుంచి పాడుతుంటే నవ్వుకుంటూ మెట్లు దిగింది హరిణి.

హాస్టలుకు ఎదురుగా వాడు నిలబడి ఉన్నాడు. హరిణిని చూసి నవ్వాడు. చేతివాచీ చూసు కున్నాడు. హరిణి వాడ్ని గమనించనట్లే ముందుకు వెళ్లింది.

ఆమె వెనకే వాడు నడుస్తున్నాడు.

ఆమె టిఫెన్ సెంటర్‌లోకి వెళ్లింది. వాడూ వెళ్లాడు. ఆమె టిఫిన్ చేస్తున్నంత సేపూ వాడు తినేసేటట్లు చూస్తున్నాడు.

హరిణి బస్‌స్టాప్‌లోకి వచ్చి బస్ కోసం ఎదురు చూస్తూ నిలబడింది. అక్కడ ఇంకొంత మంది స్టూడెంట్స్ కూడా బస్ కోసం వెయిట్ చేస్తున్నారు. రోజూ కలిసే ఒక అమ్మాయి హరిణిని చూసి నవ్వింది. హరిణి 'హాయ్' అంటూ ఆ అమ్మాయితో మాటలు కలిపింది.

హరిణి వెనకనే నిలబడిన కొంగలాగ సన్నగా పొడుగ్గా ఉన్నవాడెవడో – 'ఫుల్లు బాటిలెత్తి దించకుండా తాగినట్టుందే... గుండె పేలినట్టుందే...'' అని పాడాడు.

దేవదాసు వాడి మీదకు యుద్ధానికి దిగాడు. ''ఏంటీ, లేడీస్, వెనకాల నిలబడి పిచ్చి పాటలు పాడుతున్నావ్... నిజంగానే పేలిపోతావురోయ్?..'' అని హెచ్చరించాడు.

''ఏంట్రా.... నీ సొంతం అయినట్టు మాట్లాడుతున్నావ్...'' అని అడిగాడు కొంగ.

''అవున్రా.... నా సొంతమే... ఇంకో మాట మాట్లాడావంటే నరికేస్తా...'' అని రెచ్చిపోయాడు దేవదాసు.

హరిణి, వాళ్లకు కొంచెం దూరంగా వెళ్లి నిలబడింది. బస్సు వచ్చింది. ముందు నుంచి బస్సు ఎక్కింది. దేవదాసు వెనక నుంచి బస్సు ఎక్కి అందర్నీ తోసుకుంటూ ఆడవాళ్ల సీటు దగ్గరకొచ్చి నిలబడ్డాడు –

హరిణి డ్రైవర్ వెనక సందు చేసుకుని అక్కడే నిలబడి పోయింది.

అమీర్‌పేటలో ఆమె దిగింది. వాడూ దిగాడు.

మైత్రీవనం దగ్గర ఆమె ఫ్రెండ్స్ కొంత మంది కల్సారు. వాళ్లతో కల్సి లోపలికి వెళ్లింది.

రోజూ ఇదే వరస.

వీడొక న్యూసెన్స్‌లా తయారైనా వాడి గురించి ఆలోచించి టైం వేస్ట్ చేసుకోవడం ఆమెకు ఇష్టం లేదు... 'ఇష్టం లేదు, నా వెంట పడొద్దు' అని చెప్పినా



వినడీ పిచ్చికుక్క.. నాలుగు రోజులు తిరిగి తిరిగి వాడే విసుగు పుట్టి పోతాడనుకుంది హరిణి.

ఆమె ఆశలు ఆకాశాన విహరిస్తున్నాయి. కంప్యూటర్ కోర్సులన్నీ పూర్తి చేసింది. స్కిల్ సంపాదించింది. జి.ఆర్.ఇ., టోఫెల్... పట్టుదలగా చదువుతోంది. ఆమెరికా వెళ్లి ఎం.ఎస్. చేసి, ఉద్యోగం చేసి, సంపాదించి ఓ యాభై లక్షలు మేనమామకి పంపించాలి. అదీ ఆమె లక్ష్యం.

పదేళ్లకిందట హరిణి తల్లీదండ్రీ కారు ప్రమాదంలో ఒకేసారి చనిపోయారు. అప్పటి నుంచి మేన మామ దగర ఉంటోంది. ఆయన ప్రోత్సాహం అండ దండలతోనే ఇంతవరకూ నెట్టుకొచ్చింది.

మొదటి నుంచీ తను నష్టజాతకురాలినని హరిణి మనసులో క్రుంగి పోతుంటుంది. తల్లినీ తండ్రినీ పోగొట్టుకోవటమే అందుకు నిదర్శనం. వాళ్ల అండ కావల్సిన సమయంలోనే వాళ్లు ఆమెను ఒంటరి దాన్ని చేసి వెళ్లిపోయారు. పెద్దగా ఆస్తిపాస్తులు లేవు.

ఎంతో దుఃఖాన్ని దిగమింగుకుని, దృష్టినంతా చదువుమీదనే కేంద్రీకరించి, లక్ష్యానికి చేరువు అవుతున్న సమయంలో, అమెరికాలో ఆర్థిక సంక్షోభం వచ్చి పడింది. ఎంతో కాలంగా పని చేస్తున్న వాళ్లే రోడ్డున పడ్డారు. ఇంక తను ఎంతచదివినా ఏం ప్రయోజనం? తన జాతకమే బాలేదు... అన్నీ ఆటంకాలే...

హాస్టల్‌లో మిగిలిన అమ్మాయిలంతా సినిమాలకు, షికార్లకు వెళ్లిన సమయంలో, హరిణి ఇంత లావు పుస్తకాలతో కుస్తీ పడుతుంటుంది. సరిగ్గా ఆ సమయంలోనే కరెంటు పోతుంది. గంటో, రెండో గంటలో... కరెంటు వచ్చే సమయానికి మళ్లీ అందరూ చేరతారు... సొల్లు కబర్లు చెప్పు కుంటూ... రోజుకో పావుగంట అయినా చదువుకోలేక పోతోంది. తన ఫ్రెండ్స్ అందరికీ సొంత భవనాలున్నాయి. కార్లు ఉన్నాయి. చదువుకోవటానికి ఏ.సి. రూమ్స్ ఉన్నాయి. సాయంత్రం పూట చదవటానికి లాన్స్ ఉన్నాయి. కరెంటు పోయినా ఇబ్బంది లేకుండా ఎమర్జన్సీ లాంప్స్ ఉన్నాయి. తనదే ముదనష్టపు

జాతకం... అనుకుంటూ హరిణి రోజుకో పదిసార్లు మథన పడిపోతుంటుంది.

రాత్రి భోజనాలు అయినాక పన్నెండు గంటల దాకా హాస్టల్‌లోని అమ్మాయిలంతా బాతా ఖానీ కొడుతుంటారు. అక్కడున్న వాళ్లని ఆటపట్టించడం అంటే మహాసరదా...

''హరిణీ అమెరికా ఎప్పుడెళ్తున్నావే? విమానాల ధరలు తగ్గించారట. ఇంక నీదే ఆలస్యం...'' అన్నది రమణి.

''దానిదేముంది? దేవదాసుని అడగాలి కదా.... వాడు పర్మిషన్ ఇవ్వాలి గదా...'' అన్నది పల్లవి.

''మీ ఇష్టం వచ్చినట్లు అనుకోండి. నన్ను మానసికంగా హింసించి పైశాచిక ఆనందం పొందటమే మీకు ఇష్టమైతే, అలాగే అనుకోండి.. నా బతుకే నవ్వుల పాలై పోయింది. నేను అమెరికా వెళ్లలేను. ఆముదాల వలసలో రోడ్లు ఊడ్చేవాడ్ని చేసుకుని, ముష్టెత్తుకు తింటూ బతుకుతాను. ఆర్‌యూ హేపీ...'' అంటూ హరిణి సీరియస్‌గా అరిచేటప్పటికీ అందరూ మౌనం వహించారు.

ఒక నిముషం ఆగి హరిణి అన్నది దుఃఖాన్ని ఆపుకుంటూ ''నా చిన్నప్పుడే తల్లినీ తండ్రినీ మింగేసిన రాక్షసిని. నేను కంప్యూటర్ కోర్సులు చదివేటప్పటికీ ఐ.టీ. ఉద్యోగాలు మట్టి గొట్టుకు పోయాయి. రేపు నన్నెవడన్నా చేసుకున్నా, వాడూ ఏ లారీ కిందో పడి చస్తాడు. నేనొట్టి దరిద్రపు జాతకపు దాన్ని... నాతో స్నేహం చేయకండి... మీకూ ఏమైనా జరగొచ్చు...'' దిండు మొహానికి కప్పుకుని వెక్కివెక్కి ఏడ్చింది హరిణి.

పల్లవి హరిణి వీపు మీద చెయ్యి వేసి నిమురుతూ ఓదార్చింది ''కూల్ డౌన్... కూల్ డౌన్... నిన్ను హర్ట్ చెయ్యాలనీ, బాధపెట్టాలనీ కాదు హరిణి... ఈ వయసులో మనకు ఎన్నో కలలు వస్తుంటాయి. ప్రతికలా నిజమవుతుందనీ, ప్రతి అవకాశమూ మనకు కల్సొస్తుందని అను కుంటాం. కానీ అనుకున్న వాటిలో వందో వంతు కూడా మనకి కల్సి రాదు. ఇక్కడున్న వాళ్లందరి జీవితాలు ఇంచుమించు నీలాంటివే. ఏ నెల ఇంటి నుంచి డబ్బు వస్తుందో రాదో తెలియదు. ఏ పూట అన్నం తింటామో లేదో తెలియదు. అలా అని ఏడుస్తూ కూర్చోలేం... మాడే కడుపుల్ని, చిను గుల డ్రెస్సులనీ, ఖాళీ పర్సులనీ - మోసుకుంటూ తిరిగే అభాగ్యులం... ఈ కష్టాలనీ, కన్నీళ్లనీ దిగమింగుకుని, కేరే జాట్ - అంటూ జోక్ లేసుకుంటూ, ఉన్నంతలో ఈ కాస్త ఆనందాన్ని అయినా అనుభవిద్దామని - మనల్ని మనమే అపహాస్యం చేసుకునే దౌర్భాగ్యపు స్థితి మనది.... ఏడ్చి ప్రయోజనం లేదు... స్ట్రగుల్... స్ట్రగుల్... స్ట్రగుల్... ఇదే మన జీవితాంశం...'' అంటూ ఊరడించింది పల్లవి.

హరిణి కన్నీళ్లు తుడుచుకుంది.

రోజూ ఆరింటికి లేచి, రెడీ అయిపోయే హరిణి ఎనిమిది గంటలైనా నిద్రలేపక పోవడంతో పల్లవి హరిణి దుప్పటి తొలగించి ఒంటి మీద చెయ్యి వేసి చూసింది. హరిణి ఒళ్లు కాలిపోతుండడంతో కంగారు పడి రమణిని పిల్చింది.

పది గంటలకు దగ్గర్లోని క్లినిక్‌కు తీసుకెళ్లారు. డాక్టరమ్మ లేదు. ఆయా టెంపరేచర్ చూసింది. జ్వరానికి ఏం ఇంజెక్షన్ ఇస్తారో ఆయాకు తెల్సు. అంతకు ముందు కూడా ఒకామెకి ఆయానే ఇంజెక్షన్ ఇచ్చింది. ఆదే సూదితో హరిణికీ ఇంజెక్షన్ ఇచ్చింది. యాభై రూపాయలు తీసుకుని జాకెట్లో దోపుకుంది.

హరిణిని హాస్టల్‌కు తీసుకొచ్చారు - పల్లవి, రమణి. ఆ రాత్రి ఇంకా ఒళ్లు కాలిపోయింది. మర్నాడు మళ్లా తీసుకెళ్లారు. ఆ ఆయానే ఉంది. ''సీజన్ మంచిగ లేదు. అందరూ బీమారు అయితున్రు. యాంటీ బైటిక్ ఇంజక్షన్ నాలుగు రోజులియ్యాలి. తగ్గిపోద్ది ఫికర్‌గాకండ్రి...'' అని ధైర్యం చెప్పింది.



దేవదాసు రోజూ క్రమం తప్పకుండా హాస్టల్ ముందు కాపలా కాస్తున్నా హరిణి కనిపించడం లేదు. ధైర్యం చేసి ఒక రోజు గేటు దగ్గర నిలబడిన పల్లవిని అడిగాడు.

''ఈ హాస్టల్‌లో తెల్లగా బొద్దుగా ఉంటుంది. ఆ అమ్మాయి కనిపిస్తలేదేం?''

''నీ కెందుకు?'' అని అడిగింది పల్లవి.

''నా ఫ్రెండ్... గాళ్ ఫ్రెండ్...'' అన్నాడు దేవదాసు.

''ఆమె పేరు తెల్సా నీకు?''

''తెల్వదు...''

''ఊరు తెల్సా నీకు?''

''తెల్వదు... బస్ స్టాప్‌లో కలుస్తది...''

''నీతో మాట్లాడిందా?''

''లే...''

''ఎప్పుడున్నా ఏడ్చిందా?''

''లే...''

''మరి ఫ్రెండ్ అంటున్నావ్? ఏం తెల్వదంటున్నావ్? ఇదేం ఫ్రెండ్..''

''దినాం కలుస్తం గదా...''

''బస్ స్టాప్‌లో రోజూ వెయ్యి మంది కలుస్తారు. వాళ్లందరూ నీ ఫ్రెండ్సేనా?''

''ఈమె అంటే ఇష్టం నాకు..''

''ఆమెకు నువ్వంటే ఇష్టం ఉందా?''

''తెల్వదు....''

''ఆమె లేదు. ఖాళీచేసి వెళ్లి పోయింది...'' అని చెప్పింది పల్లవి.

కానీ మర్నాడు మళ్లీ హరిణి బస్‌స్టాప్‌లో దేవదాసుకు కనపడింది. హరిణి ఇంకా కోలుకోలేదు. నీరసంగా ఉంది. దేవదాసును చూసి తల తిప్పుకుంది.

ఒక ముసలాయన హరిణి వెనక నుంచి వెళ్తుంటే చెప్పుకు రాయి తగిలి తూలి పడబోయి, హరిణి భుజం మీద చెయ్యి వేశాడు.

దేవదాసు అది చూసి రెచ్చిపొయ్యాడు. ''అరే ముసిలి ముండాకొడకా... పడుచు పిల్ల కావాల్రా నీకు? ఆమె భుజం పట్టుకుంటావ్? ఎట్ల గనిపిస్తుందిరా నీకు? ఆ... పట్‌కుంటావ్‌రా?'' అంటూ ముసలాయన్ని ఒక్క తోపు తోశాడు. ఆయన కిందపడి పొయ్యాడు. లేవదీసి మళ్లా తోశాడు. ఇనప బల్ల అంచు తగిలి, గాయం అయింది. రక్తం కారింది.

జనం అంతా గుంపుగా గుమిగూడారు. పోలీసు వచ్చాడు. ముసలాయన్ని, దేవదాసుని స్టేషన్‌కి తీసుకెళ్లాడు.

సాయంత్రం హరిణి పల్లవితో చెప్పుకుని ఏడ్చింది. ''వీడు నా పాలిట శనిలా దాపురించాడు. నా కున్న సమస్యలతోనే సతమతమవుతుంటే, వీడు నన్ను వేధించుకు తింటున్నాడు... నేను ఈ హాస్టల్ నుంచి వెళ్లిపోతాను...'' అన్నది.

''వాడో లోఫర్ వెధవ... వాడికసలు నీపేరు కూడా తెలియదు... గాళ్ ఫ్రెండ్ అట... గాళ్ ఫ్రెండ్.... వాడికోసం నువ్వు హాస్టల్ విడిచి వేరే చోటుకు వెళ్లినా, ఎక్కడో చోట పట్టుకుంటాడు. అంతగా అయితే పోలీసు కంప్లయింట్ ఇద్దాం...'' అన్నది పల్లవి.

హరిణికి మళ్లీ రెండు రోజులు జ్వరం. తగ్గినట్లే తగ్గుతోంది. వారానికో, పది రోజులకో విపరీతంగా జ్వరం వస్తోంది. తరుచు ఇలా రావటం ఎందుకో డాక్టర్‌కీ అంతు బట్టలేదు. రక్త పరీక్ష చేయించు కోమన్నాడు.

ఆ రిపోర్టు హరిణిని మరింత కృంగదీసింది. హెచ్.ఐ.వి. పాజిటివ్ అని రిపోర్టు రావడంతో హరిణి నివ్వెర పోయింది. అయితే ఈ విషయం ఎవరికీ చెప్ప లేదు - చివరకు డాక్టర్‌కు కూడా.

ఎయిడ్స్ రోగం ఎలా వచ్చిందో తెలియటం లేదు. శారీరకంగా కన్నా మానసికంగా ఆమెను ఈ కనిపించని వ్యాధి మింగెయ్యడం మొదలు పెట్టింది. తన రోగం గురించి తెలిస్తే అందరూ తనని వెలివేస్తారు. హాస్టల్ నుంచి తరిమేస్తారు. తన మొహం చూస్తునే పాపం అన్నట్లు దూరంగా పారిపోతారు.

అందరితో కల్సిమెల్సి ఉండలేక పోతోంది. ఏదో భయం. ఏదో సంకోచం. కడుపు నిండా తిండి తినలేక

పోతోంది. కంటి నిండా నిద్ర పోలేక పోతోంది. పగటి పూట కూడా ఏ పార్క్‌కో వెళ్లి ఒక చోట ఒంటరిగా కూర్చుని తీవ్రమైన ఆలోచనల్లో నిమగ్నమై పోతోంది.

ఈ వ్యాధి క్రమంగా తనని మింగేస్తోంది. తన అందాన్ని చూసి మగవాళ్లు ముచ్చటపడితే, ఆడవాళ్లు ఈర్ష్య పడే వాళ్లు. అదంతా గతం. ఇంకో అయిదారు నెలల్లో ఈ రూపం మారిపోతుంది. యవ్వనం తెచ్చి ఇచ్చిన ఈ అందమైన ఒంపు సొంపులన్నీ క్రమంగా కరిగి పోతాయి. ఎముకల గూడులా తయారవుతోంది. అందవిహీనంగా మారి... అందరికీ దూరమై... శారీరకంగా క్షీణించి... మానసికంగా కృంగి కృశించి... ఎక్కడో నిర్జనంగా ఉన్న చోట, ఓ నిశి రాత్రి వేళ... ఈ ప్రాణాలు గాలిలో కలిసిపోతాయి. ఈ ఎయిడ్స్ రోగి మృత కళేబరం దగ్గరకు చీమలూ, దోమలూ కూడా రావు... అంత నికృష్టమైన చావుకోసం, ఎదురు చూస్తూ, అనుక్షణం చస్తూ బతకట మెందుకు?

ఇప్పుడు హరిణికి అమెరికా వెళ్లాలన్న కోరిక లేదు. కొత్త కొత్త కోర్సులన్నీ అధ్యయనం చేయాలన్న ఆశ లేదు. లక్షలు లక్షలు గడించాలన్న అభిప్రాయమూ లేదు. సమాజానికి, స్నేహితులకి దూరమై, వెలియై దిక్కులేని చావు చావటం కన్నా, నలుగురిలా గౌరవ ప్రదంగా ఈ లోకానికి గుడ్‌బై కొడితే చాలు... అదే పది వేలు...

తను నష్ట జాతకురాలినని హరిణికి తెల్సు. కానీ చావులోనూ ఇంత నికృష్టమైన ముగింపు ఎదురవుతుందని ఆమె కలలో కూడా ఊహించ లేదు.

ఏదో కృత నిశ్చయం చేసుకున్న దానిలా - లేచి నిలబడింది. లిఫ్ట్‌లో పది అంతస్తుల భవనంలో పైకి చేరుకుంది. ఆపైన మెట్లు ఎక్కింది. పిట్ట గోడ దగ్గరకి చేరుకుంది. ఒక క్షణం కళ్లు మూసు కుంది.

'భగవంతుడా, కోరి జీవితాన్ని అంతమొందించుకోవటం తప్పు అని తెల్సు. కానీ బతకటం చావటం కన్నా దుర్లభమైనప్పుడు చావటమే నయం కదా.... నువ్వు నా పట్ల చేసిన ఎన్నో తప్పుల వల్లనే నేనీ తప్పు చేయాల్సి వస్తోంది...' అని ముందుకు వంగింది.

అంత ఎత్తునుంచి అందమైన హరిణి నేల మీద పడి, నెత్తురు ప్రవాహంలో తడిసి పోయింది. ప్రాణాలు మాత్రం గాలిలో తేలి, పైకి, పైపైకి వెళ్లి పోయాయి.

క్షణంలో అక్కడంతా అలజడి... చుట్టూ జనం...

'అయ్యో.... పాపం...'

'ఇప్పుడీ జనరేషన్ అంతే. ఏ చిన్న సమస్య వచ్చినా చావే శరణ్యం...'

పోలీసులూ వచ్చారు. శవాన్ని చూశారు. హేండ్ బ్యాగ్ వెతికారు. ఐ.డి. కార్డు దొరికింది. ఫోన్ నెంబర్లు దొరికాయి.

హాస్టల్‌లోని అమ్మాయిలంతా వచ్చారు. పోలీసులు ఎంక్వయిరీ చేశారు.

''ఆమెకు ఎన్నో ఆశలుండేవి. అమెరికా వెళ్లాలని... జాబ్ చేసి మంచి పొజిషన్ వెళ్లాలనీ కలలు కనేది..'' అని చెప్పారు ఆమె ఫ్రెండ్స్.

''మరి ఎందుకిలా?'' అని అడిగారు పోలీసులు.

''ఎవడో ఆమెను రోజూ వెంబడించి, విసిగించి, వేధించే వాడు... అందుకనే...''

మర్నాడు ఉదయం హాస్టల్ ముందు రోజులాగానే పాగా వేసిన దేవదాసుని మఫ్టీలో ఉన్న పోలీసులు పట్టుకున్నారు.

''నాకే పాపం తెలియదు... అందంగా ఉందని రోజూ ఆమె వెనకే వెళ్లేవాడ్ని... అంతకు మించి నాకేం తెలియదు...'' అని మొత్తుకున్నాడు.

వాళ్లు వినలేదు.

కోర్టులో కేసు నడిచింది. ఒక ఆడపిల్లను నిత్యం వేధించి మనోవ్యాధికి గురిచేసి, ఆమె ఆత్మహత్య చేసుకునేందుకు కారకుడైన దేవదాసుని కోర్టు ఏడేళ్ల జైలుశిక్ష విధించి, కఠినంగా శిక్షించింది.

''అందాన్ని చూసి ఆరాధించినా, ఇంత పెద్దశిక్షా?'' అని అడుగుతున్న దేవదాసుకి సమాధానం చెప్పేవాళ్లు ఎవరూ లేరు.

✲

# మీరే డిటెక్టివ్ అయితే...!?

- మల్లాది వెంకటకృష్ణ మూర్తి

## కోమా

పాక్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ డిటెక్టివ్ యుగంధర్‌ని 2004లో పట్టుకుంది. పాక్‌లోని ఇండియన్ గూఢచారుల వివరాలని చెప్పమని హింసించడంతో అతనికి స్పృహ తప్పింది. ఓ హాస్పిటల్‌లో మెలకువ వచ్చాక, అతను గత మూడేళ్లుగా కోమాలో ఉన్నాడని ఈ మూడేళ్లలో ప్రపంచంలో చాలా మార్పులు చోటు చేసుకున్నాయని డాక్టర్లు యుగంధర్‌కి చెప్పారు. అది అబద్ధం అని యుగంధర్ ఎలా తెలుసుకున్నాడు?

**క్లూ 1:** 2004లో యుగంధర్ కోమాలోకి వెళ్లాడు.

**క్లూ 2:** హాస్పిటల్ గోడకి 2007 కేలండర్ తగిలించి ఉంది.

**క్లూ 3:** పాకిస్థాన్, ఇండియాలు తిరిగి కలిసి పోయాయని ఐఎస్ఐ ఏజెంట్ చెప్పాడు.

**క్లూ 4:** పాకిస్థాన్‌లోని ఇండియా గూఢచారుల వివరాలని చెప్పమని ఆ ఏజెంట్ కోరాడు. చెప్పబోతూ, నర్స్ చేతి గడియారాన్ని చూసిన యుగంధర్ ఆగిపోయాడు.

ఎందుకు?



**సొల్యూషన్ :** నర్స్ వాచ్ డేట్స్ చూపించే వాచి. అది ఫిబ్రవరి 29 చూపించింది. 2004 లీప్ ఇయర్ కాబట్టి అది ఆ తేదీని చూపించింది. 2007 లీప్ ఇయర్ కాదు కాబట్టి వాళ్లు చెప్పింది నిజమైతే అది ఫిబ్రవరి 29 చూపించదు. మార్చి 1 చూపించాలి. తన కోమా గురించి శత్రువులు అబద్ధం చెప్పారని డిటెక్టివ్ యుగంధర్ గ్రహించాడు.

## మీరే డిటెక్టివ్ అయితే...